క్లుప్తంగా

అడవులను నరికితే కఠిన చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ఉపేందర్

మణుగూరురూరల్: అడవులను నరికినా, వన్య ప్రాణులను వేటాడినా కఠిన చర్యలు తప్పవని మణుగూరు ఎఫ్ఆర్ఓ ఉపేందర్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ.. కొత్తగా అడవులను నరకడం, వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్యామ్, లక్ష్మయ్య, రామచంద్రయ్య, ముజాహిద్, రవి, ధనుంజయ్, ప్రసాద్, సంధ్య, పద్మ, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ సభ్యులుగా భద్రాద్రి న్యాయవాదులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన న్యాయవాదులు బార్ అసోసియేషన్ నుంచి ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికయ్యారు. తెలంగాణ ఐఏఎల్ రెండో రాష్ట్ర మహాసభల్లో పట్టణానికి చెందిన న్యాయవాదులు పేరాల వెంకటేశ్వర్లు, ఎం.తరుణి, సాధపల్లి సతీష్‌లకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు.

ట్రెంచ్‌లు నిలిపివేయాలి

అశ్వాపురం: గిరిజనులు ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు చేస్తున్న ట్రెంచ్ పనులను వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపీ మీడియం బాబురావు అన్నారు. సీపీఎం అనుబంధ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. తొలుత మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. తహసీల్ ఎదుట ధర్నా అనంతరం తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియం బాబురావు మట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు అటవీ అధికారులకు ట్రెంచ్‌లు ఆపేందుకు సమయం ఇస్తున్నామని, ఆ లోగా ఆపకపోతే ఈ నెల 13 నుంచి ఆయా గిరిజన గ్రామాల్లో అందరూ తిరగబడి ట్రెంచ్‌లు పూడ్చివేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు గద్దల శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆలయ కమిటీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ ఇన్ గెట్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్మన్‌గా జాస్తి గంగా భారతి, వైస్ చైర్మన్‌గా కుర్పాయి ఈశ్వర హరి ప్రసాద్ రాజులతో పాటు కమిటీ సభ్యులు కొర్సా జ్యోతి, తళ్ళబత్తుల వర కుమారి, వల్లభారెడ్డి రమణ, మట్టా పార్వతీ, పొడియం ఉమాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దంపతులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. రమాకాంత్, రాజీవ్, తిరుపతిరావు, రాము, వెంకటరెడ్డి, లకావత్ వెంకటేశ్వర్లు, విజయ్, వెంకట్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

అశ్వారావుపేటరూరల్: సీఎం కప్ టోర్నమెంట్ -2024ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ప్రదీప్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ పోటీలపై పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు క్రీడాకారులను గుర్తించాలని సూచించారు. అలాగే కార్పొరేట్ కంపెనీల నుంచి విరాళాలు సేకరించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు, ఎస్సై యయాతి రాజు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మణుగూరు పట్టణానికి చెందిన పెనుగొండ నరేష్‌-శిరీష దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

‘సెంట్రల్’ పనుల్లో జాప్యం

- ఏడాది క్రితమే సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ పనులు ఆరంభం
- నేటికీ ముందుకు కదలని నిర్మాణాలు
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు



రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు

ములకలపల్లి: మండలకేంద్రంలో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్‌తోపాటు, ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, డివైడర్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.5.75 కోట్లు మంజూరయ్యాయి. పనుల ప్రారంభించి సంవత్సరకాలం గడిచినా ఎటువంటి పురోగతీ కానరావడం లేదు. ‘ఎక్కడ వేసిన గొంగడి అక్కడే’ అన్నట్లుగా ఉంది ఇక్కడి పరిస్థితి.

ఆరంభించి.. అటుపై నెమ్మదించి..

ఆరంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఆర్అండ్‌బీ పరిధిలో 50 అడుగులలోపు ఇళ్లు, షెడ్లు వాటి ముందర నిర్మాణాలను తొలగించారు. సుమారు ఏడాది క్రితమే దుకాణాలు, ఇళ్ల ముంగిళ్లలోని కాంక్రీట్, సీసీలను కొంతమేర తవ్వి గోతులమయంగా మార్చి వదిలేశారు. అంతేకాకుండా ప్రధాన రహదారికి ఇరువైపులా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న డ్రెయినేజీ కాలువ సైతం ఈ పనుల్లో పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇళ్లలోని మురుగంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వాహనాలు వెళుతున్న సమయంలో పాదచారులపై, ద్విచక్ర వాహనాదారులపై పడుతోంది. ఈ ఉదంతం పత్రికల్లో కథనాలు రావడంతో తూతూమంత్రంగా మరో కాలువ తవ్వారు. అయితే అదికూడా పాడైపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డుపైకి ప్రవహిస్తూ.. ముక్కుపుటాలు పగిలిపోయేలా దుర్వాసన వస్తోంది. పనుల పేరిట తాత్కాలిక కాలువను నాశనం చేసిన గుత్తేదాటు అటుపిమ్మట పనులపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా విద్యుత్ లైన్ల ఏర్పాటు, చెట్ల తొలగింపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రధాన పని నేటికీ ఆరంభించపోవడం గమనార్హం. నూతన విద్యుత్ లైను అంటూ కొత్తగా 45 అడుగుల పరిధిలో కొత్తగా స్తంభాలు వేశారు. వాటిని విద్యుత్ వైర్లు లాగనేలేదు. ఇక భూమిలోని తాగునీటి పైపుల తొలగింపు, వాటి స్థానంలో నూతనంగా మరో పైపులైను నిర్మాణం ఊసేలేదు. ఇక సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్డు నిర్మాణాల పనుల జాడేలేకుండా పోయింది. దీనికితోడు ఇటీవలే శాశ్వత డ్రెయినేజీ నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రకటించిన నేపథ్యంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ నత్తనడకన సాగుతున్న పనుల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన సెంట్రల్, డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

‘సెంట్రల్’ పనులంటూ ఇళ్ల ముందర షెడ్లను తొలగించేశారు. ముంగిళ్లలోని కాంక్రీట్‌ను తవ్వేశారు. దీంతో గోతులమయంగా తయారైంది. ముగురు నీరు నిలిచి, చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ఎండి.సికిందర్, వ్యాపారి

మళ్లీ మొదలు పెడతాం..

అనివార్య కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. మరలా మొదలుపెడతాం. త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం. సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

– లఖన్‌నాయక్, ఏఈ, ఆర్అండ్‌బీ

శరవేగంగా భద్రాద్రి అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో గతంలో లేని విధంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి వేదికగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి ఇచ్చిన హామీలను వంద శాతం పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గంలో రూ.81.30 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందన్నారు. భద్రాచలం అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణతో రూ.63 కోట్లు మంజూరు చేయగా, భూసేకరణ పనులు జరుగుతున్నారని చెప్పారు. అలాగే వెంకటాపురంలో జూనియర్ కళాశాల మంజూరు, మండలాభివృద్ధి పనుల కోసం భద్రాచలానికి రూ.6.25 కోట్లు, దుమ్ముగూడెంకు 9.10 కోట్లు, చర్లకు రూ.7.30 కోట్లు, వెంకటాపురానికి 6.95 కోట్లు, వాజేడుకు 6.90 కోట్ల నిధులతో పాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సూమారు రూ.3.60 కోట్ల అందజేయడం జరిగిందన్నారు. దీంతో పాటు మండలాలో అనేక ఏళ్ళుగా ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరి చేసి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రమాకాంత్, తిరుపతిరావు, నవాబ్, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో తనిఖీ

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతోపాటు రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గురువారం అశ్వారావుపేటలోని సామాజిక ఆస్పత్రి, దమ్మపేట, పట్వారీగూడెం పీహెచ్‌సీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో సిబ్బంది పనితీరు పరిశీలించి సూచనలు చేశారు. అలాగే సీహెచ్‌సీలో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పలు ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలను సందర్శించి రోగులను ఇబ్బందులు పెట్టొదని, అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మోహిద్దిన్, వైద్యులు విజయకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ పాటించాలి

బూర్గంపాడు: తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ పిలుపులో భాగంగా ఈ నెల 7వ తేదీన ఆటో కార్మికులందరూ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని ఆటో యూనియన్ జేఏసీ నాయకులు అమీర్ పాషా, ఎమ్మెస్కే అబ్దుల్లా పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని ప్రాంతాల ఆటో యూనియన్ నాయకులతో కలసి గురువారం సారపాకలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల ఆర్థిక చేయూతనందిస్తానని ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ల అధ్యక్షుడు సాధిక్ పాషా, శ్రీనివాస్, సాంబ, వెంకటేశ్వర్లు, వెంకన్న, పవన్, జానీ, నర్సింహరావు, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.

లక్ష్మయ్య సేవలు ఎనలేనివి

గుండాల: మండల కేంద్రానికి చెందిన గామాలపాటి లక్ష్మయ్య మరణం న్యూడెమోక్రసీకి తీరని లోటని మాజీ సర్పంచ్ కోరం సీతారాములు అన్నారు. బుధవారం రాత్రి గామాలపాటి లక్ష్మయ్య (70) అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం పార్టీ నాయకులు ఆయన భౌతికఖాయంపై జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సానుభూతిపరుడిగా ఎంతగానో సహాయ సహకారాలు అందించాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు యాసారపు వెంకన్న, అజ్జర్, వీరన్న పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలు



దుమ్ముగూడెం: యూత్ కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేష్..

అశ్వాపురం: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఎన్నికయ్యారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడుగా బొల్లినేని సురేష్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా బూర్కా అశోక్, ప్రధాన కార్యదర్శిగా కర్రి భువన సంతోష్, ఉపాధ్యక్షుడుగా గొల్లపల్లి నరేష్ ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే పాయం, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యకు ఎన్నికైన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్..

మణుగూరుటౌన్: యూత్ కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మణుగూరుకు చెందిన పెంట్యాల వెంకటేష్ ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్‌లో 947ఓట్లతో ఆయన విజయం సాధించారు. గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆయనను అభినందించారు.

దమ్మపేట మండల అధ్యక్షుడిగా రమేష్..

దమ్మపేట: మండలంలోని అంకంపాలెంకు చెందిన కాకా రమేష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్‌లో ఆయనకు అత్యధిక ఓట్లు నమోదయ్యాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు రమేష్ కృతజ్ఞతలు తెలపగా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

దుమ్ముగూడెం: నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ నాయకులను గురువారం లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్‌గా సిద్ది ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్స్‌గా గంటల ప్రశాంతి, కారం నవీన్, బుర్రి లావణ్య ,జనరల్ సెక్రెటరీగా పూజారి రాజేష్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా భద్రాచలం నియోజకవర్గ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్ కుమార్, జిల్లా జనరల్ సెక్రెటరీ చింతిరాల సుధీర్, జిల్లా సెక్రెటరీగా తెల్లం నరేష్ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ కనుబుద్ది దేవా,కాంగ్రెస్ నాయకులు స్వామి, తెల్లం హరికృష్ణ, డింగి సందీప్ రెడ్డి, మున్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు నీటి సరఫరా బంద్

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం ఇన్‌టేక్ వెల్‌లోని సిల్ట్ తొలగింపులో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ యాదగిరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి మూడు రోజులు మున్సిపాలిటీ ప్రజలకు నీటి సరఫరా అంతరాయం ఏర్పడుతుందని గమనించి మిషన్‌భగీరథ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

‘స్వచ్ఛతాహీ సేవ’..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాల, పర్ణశాల ఆలయం ప్రాంగణంలో సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ ఆధ్వర్యంలో చెత్తాచెదారాన్ని గురువారం తొలగించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జున్, జవాన్లు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీని గ్రామపంచాయతీగా మార్చాలని కోరుతూ పట్టణంలో కర్నె రవి ఆధ్వర్యాన గురువారం సంతకాలు సేకరించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయమై బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. తొలిరోజు 2,432 సంతకాలు చేయగా నాయకులు లింగంపల్లి రమేష్, ఆలెంకోటి, గురజాల గోపి, షభానా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

దమ్మపేట: మెదడు, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం సత్తుపల్లికి చెందిన యువ భారత్ ఫౌండేషన్ బాధ్యులు రూ.67వేలను గురువారం అందజేశారు. మండలంలోని అంకంపాలెంకు కాకా చెన్నారావు ఐదు నెలల కమార్తె అన్విత హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. నిరుపేద అయిన చెన్నారావు వైద్యఖర్చులు భరించలేని స్థితిలో ఉండగా యువభారత్ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ.67వేలను అందజేశారు.

ఎమ్మెల్యేకు వినతి

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపునకై కృషి చేయాలని (టీయూసీఐ)ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణుగూరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు జానయ్య, సంజీవరెడ్డిలు మాట్లాడుతూ.. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ రాష్ట్ర కమిటీ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు పిలుపునిచ్చిందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతలనాలను విడుదల చేయాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అజయ్‌కుమార్, రమాదేవి, రమణ, అంజలి, కుమారి, మమత, బాయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ‘మృత్తికా’ దినోత్సవం



అశ్వారావుపేటరూరల్: మట్టి నమూనా సేకరించిన వ్యవసాయ అధికారులు

అశ్వారావుపేటరూరల్: నేలల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, భూసారాన్ని కాపాడితేనే పంటల దిగుబడి సాధ్యమని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయకృష్ణ, వ్యవసాధికారి శివరామ ప్రసాద్ సూచించారు. గురువారం ఉద్యాన పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, నారాయణపురం, తిరుమలకుంట, అనంతారం రైతు వేదిక వద్ద ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలను సేకరించి పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో రిసెర్చ్ అసోసియేట్ డాక్టర్ వి మౌనిక, సిబ్బంది కట్టా సుబ్బారావు, అకాంక్ష, రామకృష్ణ, ప్రసాద్, ఏఈఓలు సతీష్, సూరిబాబు, షాకిరా భాను, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

దమ్మపేట: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా భూసారాన్ని సంరక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శీలం చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లారం, మల్కారం, పట్వారిగూడెం, గండుగులపల్లి రైతు వేదికల్లో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా నేలల స్వభావాన్ని అంచనా వేసి, తదనుగుణమైన పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. సాగు నేలలో లోపించిన నత్రజని, బాస్వరము, సూక్ష్మ పోషకాల మోతాదును నిర్ధారించి, తద్వారా ఎరువులను సరిపడిన మోతాదులోనే వాడవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మణుగూరు ఏడీఏ బీ.తాతారావు సూచించారు. మండలంలోని గుట్టమల్లారం గ్రామంలోని రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఏడీఏ తాతారావు మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో ప్రతీ ఏటా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. అనంతరం ఆయన రైతులకు భూసార పరీక్ష, మట్టి నమూనా సేకరణ, సమగ్ర ఎరువుల వినియోగం, నేలను ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. సదస్సులో మణుగూరు ఏఓ రాహుల్‌రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, రైతులు తోటకూరి గోపయ్య, కుర్రి చలపతిరావు, బత్తుల శ్రీను, మేడ నాగేశ్వరరావు, బత్తుల వరలక్ష్మి పాల్గొన్నారు.

గుండాల మండలాభివృద్ధికి కృషి



కస్తూర్బాలో ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

గుండాల: మారుమూల ఏజెన్సీ గుండాల మండలానికి అత్యధిక నిధులు తీసుకవచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని పినపాక నియోజక వర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన గుండాల మండలంలో పర్యటించి రూ.కోటి 50లక్షల విలువ గల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలకు నిధులు మంజూరి అయి ఉన్నాయని, అటవీశాఖ అనుమతులతో జాప్యం ఏర్పడుతోందని, త్వరలోనే ఆయా పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ముత్తాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాలను సందర్శించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పాఠశాల వరకు రూ.50లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోళ్లగడ్డ, లింగగూడెం పంచాయతీలలో రూ.28 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. చీమలగూడెంలో మంచినీటి బావి మరమ్మతుల కోసం రూ.10లక్షలు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనుల కోసం రూ.30లక్షలతో శంకుస్థాపన చేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాస్పత్రికి ఇటీవల వచ్చిన 102, 108 వాహనాలను ప్రారంభించారు. స్థానికులు ఆసుపత్రి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో కావాల్సిన రోడ్లకు, భవనాలకు సంబంధిత అధికారులు ప్రణాళికలు వేసి, నివేదికలు అందించాలనా సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, పీఆర్‌డీఈ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఏఈలు, సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, ఐసీడీఎస్ సీడీపీఓ మంగతార, సూపర్‌వైజర్లు లక్ష్మి, అనురాధ, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దారా అశోక్, ముత్తయ్య, కిరణ్, చాట్ల పద్మ, బాబూరావు, ఖాసీం, వాజీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన ఉండాలి

చంద్రుగొండ: వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉన్న రైతులు విద్యుత్ వినియోగంపై అవగాహనతో ఉండాలని ట్రాన్స్‌కో డీఈ జి.రంగస్వామి అన్నారు. విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గానుగపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. విద్యుత్ కెపాసిటర్లు అమర్చుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, ఆటోస్టార్టర్లు అమర్చడం ద్వారా వచ్చే నష్టాలను రైతులకు వివరించారు. అక్రమంగా కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని రైతులకు సూచించారు. మోటార్లు స్టార్ట్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, ఏఈలు ఎంఎల్ నర్సింహారావు, నితిష్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

శవపరీక్షా కేంద్రాన్ని ప్రారంభించాలి

చర్ల: చర్లలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శవ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దీనిని ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం చర్లలో నిర్మించిన శవ పరీక్షా కేంద్రం వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్, నాయకులు మోహన్, సుజాత, సరళ, నాగమణి, కార్తీక్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేసిన న్యాయమూర్తి

భద్రాచలంటౌన్: పట్టణంలోని వికాసం స్కూల్ బాలికలకు భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శివనాయక్ గురువారం కుట్టు మిషన్లను అందజేశారు. ఈ నెల 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన కుటు మిషన్లను అందజేస్తానని బాలికలకు హామీ ఇచ్చారు. అనంతరం వికలాంగుల దినోత్సవం రోజు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, ప్రిన్సిపాల్ అరుణకుమారి, న్యాయవాది రవితేజ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సర్వే

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆయా సంఘాల బాధ్యుల రాష్ట్ర నాయకులు వాసం బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఆస్పత్రులను సందర్శించి సౌకర్యాలు పరిశీలించి, డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను వైద్యాధికారులకు అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని కోరారు. నాయకులు కుంజా అర్జున్, బాడిస లక్ష్మణ్‌రావు, కారం మల్లేష్ పాల్గొన్నారు.

హరీష్‌రావు అరెస్ట్‌కు నిరసన

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరశిస్తూ వివిధ మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. రహదారులపై ధర్నాలు చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నందుకు హరీష్‌పై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నట్లు నాయకులు అభిప్రాయపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్



చర్లలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మణుగూరురూరల్: నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



పినపాక: సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి